# 2 మాతృ దేవో భవ

ఆ పూట సత్యవతి మనస్సు మనస్సులో లేదు. రోజూ సర్వ సాధారణంగా కనిపించేవే, యీ నాడు ఎంతో అందంగా ఉన్నాయి. అస్తమించే సూర్యుడు, ఎర్రటి మబ్బులు, పొన్నాయి చెట్టు, ఆమె కెంతో అందంగా కనిపించాయి. ఏదో ఘనమైన కార్యాన్ని సాధించినప్పుడు కలిగే ఆనందం, ఇప్పుడామె అనుభవిస్తున్నది. చాలా కాలం తరువాతనైనా, తనకిలాంటి 'ఘడియ' ఒక టుంటుందని, సత్యవతి ఎంతమాత్రం ఊహించలేక పోయింది.

నిజమే!

శంకరం అదో తరహా మనిషి. ఆయన ఎవరి జోలి పట్టించుకొనే వాడు కాడు. మరొక రెవరూ ఆయన జోలి పట్టించుకోవలసిన అవసరమూ కలగలేదు. ఆయన పనేమో తప్ప, అట్లా షికారుకన్నా వెళ్ళేవాడు కాదు. ఎప్పుడూ ఆ గదిలో కూచుని ఏదో చదువుకొంటూ ఉండేవాడు. చాలా కాలందాకా, శంకరం కథకుడని సత్యవతికి తెలియనే తెలి

శంకరానికీ, తనకూ, ఎలా పరిచయం కలిగిందో తన కిప్పుడు జ్ఞాపకమే లేదు. కానీ, ఉన్న జ్ఞాపకాన్ని బట్టి చెప్పాలంటే, అందుక్కారణం సుందరమనిపిస్తుంది. అవునవును - సుందరమే కారణం! ఆ రోజుల్లో సుందరం కూడా ఏదో రాస్తుండే వాడు. అవి అడపా దడపా పత్రికల్లో అచ్చవుతుండేవి. ఒకసారి ఏదో పత్రికలో సుందరం రాసిన కథ అచ్చయింది. ఆ పత్రిక వాళ్లు ఓ కాపీని సుందరానికి పంపారు. ఆ కథ చదువుతుంటే బాగానే ఉన్నట్లనిపించింది. అందులో ఉండే హీరో, హీరోయిన్‌లు, ముందు కాస్సేపు ప్రేమించుకొంటారు. ఆ తరువాత పెళ్ళి చేసుకొంటారు. ఆ కథకు సుందరం అన్నయ్య. 'ప్రణయలీల' అని పేరు బెట్టాడు.

సుందరం అన్నయ్య కథలు రాస్తున్నట్లు తెలుసుగానీ, ఇంత బాగా రాస్తాడని సత్యవతికి తెలియదు. అసలు కథ లెట్లా రాస్తారో, ఆ సంఘటనలు ఎట్లా కూరుస్తారో, సత్యవతి ఊహించలేక పోయింది. అన్నయ్య రాసిన కథను సత్యవతి రెండుసార్లు చదివి. యథాలాపంగా పేజీలు తిరగేస్తున్నప్పుడు 'అంతరాలు' అన్న మరో కథ కనిపించింది. రచయిత ఎవడో శంకరమట. పోనీ దీన్ని చదివి చూదాం, అనుకొని సత్యవతి ఆ కథను గూడా చదివింది. చదవటం పూర్తి చేశాక సత్యవతి ఓ నిట్టూర్పు విడిచింది. మొదటినుండి. తను అనుకొంటూ వస్తున్నది ఒకటయితే, చివరకు మరో లాగా కథ ముగిసి పోయింది. ఇలాంటి ముగింపు ఏ మాత్రం పసికట్టినా, సత్యవతి

ఇంతగా దిమ్మర పోకపోయేది. హఠాత్తుగా ఓ కుదుపు కుదిపి, తక్కున ఆగిపోయిందా కథ.

ఈ కథతో అన్నయ్య రాసిన కథను పోల్చుకొన్న ప్పుడు, అన్నయ్య కథ పిండెలాగా ఉంది. ఇది నిజమే నని తన కనిపించినా, నిజమో కాదో అన్నయ్యను గూడా అడిగిచూడ టం మంచిదనుకొంది.

'నిజమే!' అన్నాడు సుందరం. 'ఆ కథ చాలామంచిది. అలా రాయటం చాలా కష్టం.'

'గావును. నాకేం తెలుసు?' అన్నది సత్యవతి.

'శంకరం చాలా కాలం నుండి కథలు రాస్తున్నాడు. ఆయన పుస్తకాలు గూడా ఎవరో అచ్చేశారు. నిన్న నాకో రెండు కాపీలు గూడా ఇచ్చాడు' అన్నాడు సుందరం. అలాంటి కథకుడితో తన కున్న పరిచయాన్ని చెల్లెలకు తెలిపే ఉద్దే శంతో.

'ఏమిటీ!' అని ఆశ్చర్యపడింది సత్యవతి. 'నీకు రెండు కాపీలు గూడా ఇచ్చాడా? అంటే ఆయనగారి దీ ఊరేనా. ఏమిట్రా?'

'అదిగో! ఆ ఎదురుగా వున్న ఇంట్లోనే పై గదిలో ఉంటున్నాడు....'

'ఓరి' అని ఆశ్చర్యపడింది సత్యవతి. ఆయన్నయితే తను చాలాసార్లు చూసింది. మనిషి అదోలా ఉంటాడు. ఎప్పుడూ సిగరెట్లు కాలుస్తూ....ఆయనా ఈ కథ రాసిందీ!

కారణ మేమిటో తెలీదుగానీ, శంకరం మట్టుకు ఈ కథ రాసి ఉండడని సత్య అనుకొంది. ఆ కథలు రాసే శంకరానికీ, తను మామూలుగా చూసే శంకరానికీ, ఎక్కడా పోలికలు అందడం లేదు. అన్నయ్య తమాషా కన్నాడేమో ననుకొంది. వీడిలాంటి కోతివేషాలు అప్పుడప్పుడు వెయ్యడం కద్దు. ఇప్పుడు గూడా తనను 'మైదు' చెయ్యడానికే ఇలా అన్నాడేమో ?

'పోనీ మనింటికి ఓసారి తీసుకు రాగూడదుట్రా అన్నయ్యా ! కాసేపు కులాసాగా మాట్లాడుకోవచ్చుగా, ఇద్దరూ కథలు రాసేవాళ్ళేనాయె ! నువ్వు పిలిస్తే రాడూ ?' అన్నది సత్యవతి.

'ఏమో నే నెట్లా చెప్పను ? అయినా ఓసారి పిలుస్తాను' అన్నాడు అన్నయ్య, పదహారోసారి తను రాసిన కథను మళ్ళా చదువుకొంటూ.

సత్యవతి ఓ క్షణం అన్నయ్యకేసి చూచి, మరో క్షణం శంకరం గదికేసి చూసి, ఓ మూలుగు మూలిగి, గిరుక్కున జడను ముందుకు గిరవాటేసుకొని, లోపలి కెళ్ళింది.

## 2

రాయడమనేది ఓ వ్యాధి లాటిది. ఈ వ్యాధి సోకినవాడికి ప్రపంచం, అందరికీ కనిపించినట్టు కనిపించదు. ఈ మామూలు తనంలోంచే, ఏవేవో చూడాలని వాడు ఆరాట పడుతుంటాడు. ఆ 'ఏవేవో' చూస్తాడు గూడాను.

శంకరం ధర్మమా అంటూ సుందరాని గ్గూడా, ఈ 'వ్యాధి' బాగా సోకింది. అసలే సుందరానికి ఏమాత్రమో ఈ వ్యాధి లక్షణాలున్నాయి. శంకరం వచ్చి, దాన్ని మరింత తీవ్రదశకు తీసుకెళ్ళాడు. దీనివల్ల —నిజాని కెవరూ నష్టపోవల సిందేమీ లేదు. మహాచెడిపోతే శంకరం చెడిపోతాడు. కాదూ కూడదంటే సుందరం చెడిపోతాడు. వీళ్ళిద్దరూ ఏమయినా సీతాపతిగారు పట్టించుకొనే వాడు కాడు. ఖర్మకాలి సత్యవతి కూడా చెడిపొయ్యేట్టు కనిపిస్తున్నది. ఆయనకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నదల్లా ఈ సమస్యేనూ.

సత్యవతి మీద ఆయనకేనాడూ ఆశ లేదు. భగవంతు డిచ్చినంత వరకూ, తాను కూతురుకు ఎందునా లోటులేకుండా చూశాడు. ఇంటర్ దాకా చదువు చెప్పించాడు. అదింకా చదువుకొంటా నంటే, చెప్పించడానికి, ఈ నాటికీ సీతాపతి గారు సిద్ధంగానే వున్నాడు. అయినా రాఘవమ్మగారే బల వంతాన మానిపించింది. ఆడముండకు చదువెందుకన్నది. 'అంట్లు తోమడానికీ, నాలుగ్గింజలు ఉడకెయ్యడానికీ, బి.యె. చద వాలా' అన్నది. చదివి సాధించ గలిగిందేమీ లేనప్పుడు, దాని కోసం బోలెడంత డబ్బు ఖర్చుబెట్టడ మెందుకన్నది. ఈ మాట లన్నీ సీతాపతి గారికి, సబబుగా ఉన్నట్టుగానే తోచాయి. ఆయన ఎటూ చెప్పలేదు. సత్యవతి చదువుకొంటానంటే తను వద్దనడు. ఆమె చదవనంటే తను బలవంతం చెయ్యనూ చెయ్యడు.

తను చదవనని సత్యవతి తెగేసి చెప్పింది. కారణం ఎవ్వర్నూ అడగలేదు. ఆమె చెప్పనూ లేదు. సత్య చదువు మానేసిన తరువాత, రాఘవమ్మగారు కొంతకాలంపాటు గిజ గిజలాడింది. ఇప్పటిదాకా, సత్య చదువును మానిపించే వ్యాప కం ఆమెకుండేది. ఆవిడే మానేసింది కాబట్టి ఆ వ్యాపకమూ పోయింది.

'హమ్మయ్య !' అనుకొన్నాడు సీతాపతి.

కానీ ఆయనగారికా అదృష్టం లేదు. రెండు వారాలు గడచీ గడవకముందే సత్యవతి పెళ్ళిని గురించి గీ మారడం మొదలెట్టింది. ఇంకెంతకాలం ఇంట్లో అంటిపెట్టు కుంటా రంది. మన ముఖాన అనకపోయినా, చాటు మాటుగానై నా, మన్ని గురించి అనుకోరా అంది. దాని ఈడువాళ్ళు ఇద్దరేసి, ముగ్గు రేసి పిల్లల్ని కంటున్నప్పుడు, దానికింకా పెళ్ళి చేయకపోవడ మేమిటన్నది. సీతాపతిగారు ఈ పోరు భరించలేకపోయాడు. 'అలాగే చేద్దాం' అన్నాడు.

ఈ మాట అనిగూడా రెండు మూడు నెలలు దాటింది. సీతాపతి కూతురు పెళ్ళి చెయ్యలేదు. కనీసం ఆ ప్రయత్నంలో ఉన్నట్టుగూడా లేదు. ఈ మాటే ఒకసారి రాఘవమ్మ అడి గింది.

'అంటే నా కర్థంకాలా ? ప్రయత్నంలో ఉండటమంటే ఏదో ఆర్పుకుపోతున్నట్టు అటూ ఇటూ తిరగడమూ, లబలబ లాడటమూనా ఏమిటి ?' అన్నా డాయన.

'నేనేమన్నానని, అట్లా కళ్లెర్ర జేస్తారు? మీ కూతురికి పెళ్ళి చేసుకోమని చెప్పడంగూడా తప్పని నాకు తెలియదు... నా కెందుకొచ్చింది గానీ, మీ ఇష్టం - మీ కూతురిష్టం- చేసుకొంటే చేసుకోండి. లేకపోతే మానుకోండి. మధ్యలో నా ప్రాణాని కొచ్చిందే మాయసొద' అన్నది రాఘవమ్మ యాష్ట పడుతూ.

అప్పటిగ్గానీ సీతాపతి మామూలు మనిషి కాలేదు.

'అదిగాదే!' అంటూ ఆయన భార్యతో రాజీ బేరాని కొచ్చాడు. తరువాత ఇద్దరూ, కాస్సేపు సత్యవతి పెళ్ళిని గురించీ, తెలిసిన సంబంధాలను గురించీ మాట్లాడుకొన్నారు. వచ్చే మాఘమాసంలో సత్యను, ఓ అయ్యచేతుల్లో పెట్టాలన్న నిర్ణయంగూడా జరిగింది.

ఈ నిర్ణయాన్ని సత్యవతి ఎంతవరకు ఆమోదించిందో తెలియదు. ఆవిడ తన మనస్సులోని మాటను ఎక్కడా అన లేదు. అన్నరోజున ఎంతో కొంత సంచలనం కలుగుతుందని సత్య ఊహించ గలిగింది. నిజంగా అలాంటిదే కలిగిన నాడు, తన పక్షం మాట్లాడే వాళ్ళెవరో గూడా సత్య ఊహించింది. ఎవరు మాట్లాడినా, ఎవరు మాట్లాడకపోయినా, సుందరం తనను బలపరుస్తాడనుకొంది. ఎందుకంటే సుందరమూ, శంకరమూ ప్రాణస్నేహితులు. అదీ గాక శంకరం ఇప్పుడు సుందరం గదిలోనే ఉంటున్నాడు. ఏదో కథల్లో చెబుతారే, ఒక కంచానతినీ, ఒక మంచాన పడుకోవడమని-అలా ఉంది వాళ్ళ

స్థితి. తను శంకరాన్ని గాఢంగా ప్రేమిస్తున్నది. ఇలా ప్రేమిస్తున్నట్టు సుందరానికి తెలియ దనుకోవడం తెలివి తక్కువ. నాలుగైదు సార్లు, తనూ, శంకరమూ, లోకాభిరామాయణం మాట్లాడుకొంటుండగా—అదీ ఎవ్వరూలేనప్పుడు—అన్నయ్య వచ్చాడు. వాడేమన్నా అనుకొని పోతాడేమోనని తను భయపడింది గూడాను. కానీ ఏమీ అనలేదు. అనలేదు సరిగదా, ఆ తర్వాత గూడా, ఈ విషయాన్ని గురించి సుందరం ఎప్పుడూ తనతో ప్రస్తావించ లేదు. ఇంత బాగా కథలు రాసే సుందరం అన్నయ్య—తనెందుకు శంకరంతో 'లోకాభిరామాయణం' మాట్లాడుతున్నదీ గ్రహించలేక పోడు. గ్రహించి గూడా మెదలకుండా ఊరుకున్నాడంటే, శంకరాన్ని తను చేసుకోవటం, అన్నయ్యగ్గూడా ఇష్టమన్న మాటే!

పోతే —

ఏమాత్రమో గునిసేది నాన్న. నాన్నను ఎలాగైనా వొప్పించవచ్చు. ఇక ఎటు గూడీ కొరకరానికొయ్య అమ్మ. ఆమెగారికి తను చదువుకోవడమే ఇష్టం లేదు. ఇక శంకరాన్ని పెళ్ళాడతానంటే ఒప్పుకొంటుందా? ఒప్పుకొంటుం దనుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ఒకవేళ అమ్మ ఒప్పుకోకపోయినా మునిగిపోయిందేమీ లేదు. ఎందుకంటే అమ్మ ఒప్పుకోని అనేక పనులను, నాన్న ధైర్యంగా చేశాడు. ఏం? ఈ పని మాత్రం ఎందుకు చెయ్యడు?

అన్నీ అనుకూలించినట్టయితే ఏమయ్యేదో చెప్పలేం

గానీ, నాన్న ఒప్పుకోలేదు. పదహారణాలా తన పక్షం ఉంటా డనుకొన్న అన్నయ్య, ఎటూ చెప్పకుండా ఉండిపోయ్యాడు. ఇదేమిట్రా అంటే, వాడు బారెడు పొడుగు సమాధానం చెప్పాడు.

'ప్రేమించటానికి పనికివచ్చే వాళ్ళు, పెళ్ళాట్టానికి పనికిరారు. ఈ సంగతి నీకు తెలియదు. అందుకే శంకరాన్ని చేసుకుంటా నంటున్నావు. శంకరం ఆదర్శభర్త కాగలడేకానీ, అందరిలాగా సంసారం చేయడానికి పనికిరాడు....అదిగాదు సత్యా! వాణ్ని నువ్వు చూస్తున్నావు గదా! ఎలాంటి సోమరిపోతో నీకు తెలియడం లేదా? పనీ పాటా లేకుండా, ఏవేవో వెధవరాతలు రాసుకొంటూ, ఉన్నప్పుడు తింటూ, లేనప్పుడు పస్తులు పడుకొంటూ ఉండేవాడులే నువ్వు ప్రేమించ డానికి దొరికింది? శంకరానికి కీర్తయితే ఉన్నది గానీ డబ్బు లేదు. ఓ నిష్టదరిద్రుణ్ని చేసుకొని నువ్వు సుఖపడే దేమిటో గూడా నాకు తోచకుండా ఉంది. మంచి కథలు రాసేవాడుగా శంకరాన్ని ఎటుగూడీ గౌరవిస్తాం. కానీ మంచి కథలు రాయడమన్నది, ప్రేమించడానికి ఓ యోగ్యతని, నాకింత వరకూ తెలియదు. నన్నడిగితే, శంకరాన్ని చేసుకొనే ఆలో చనే పనికిరాదంటాను. కాదంటావో నీ యిష్టం. కానీ, ఒక ప్పుడు ఘోరంగా పశ్చాత్తాప పడవలసిన అవసరాన్ని; కావా లని, కలిగించుకొన్న దాన్ని వవుతావు. అయినా ఇది నీకు సంబంధించింది. నేను సలహా ఇస్తానేగానీ, శాసించను' అన్నాడు

సుందరం, కథల్లో మాట్లాడినట్లు ఆచి తూచి మాట్లాడుతూ.

సత్యవతి క్షణ కాలం దిమ్మెర పోయింది. సుందరం యిలా అంటాడని ఆమె ఎంతమాత్రం ఊహించ లేదు. ఆమె నమ్ముకొన్న అండలన్నీ ఒక్కొక్కటే కూలిపోతున్నాయి. అయినా సత్యవతి అధైర్య పడలేదు. ఆ క్షణాన ఆమె కెన్నో ఆలోచన లొచ్చాయి. తను చాలా ఒంటరిదాన్నని అనుకొంది. చుట్టూ తన శత్రువు లున్నారనుకొంది. ఇంతమంది శత్రువు లనూ, తను పరాజితుల్ని చేసినప్పుడు గానీ, తన శక్తి సామర్థ్యాలేమిటో వాళ్ళకు తెలియవనుకొంది. ఏదో వాదించింది. ఐతే వారు వినలేదు. అనవసరంగా వాదం పెంచడం ఎందుకని మెల్లగా తప్పుకొంది.

## 3

శంకరం ఇసుకలో కాళ్ళార జాపి, చేతులు రెండు వెనక్కు పెట్టుకొని, సముద్రం కేసి చూస్తున్నాడు. ఓ క్షణం తల వంచుకొని, మెల్లగా శంకరం ముఖంలోకి చూస్తూ, సత్యవతి సంభాషణ ప్రారంభించింది.

'అవును. నాకు తెలుసు. అయినా నువ్వు సుందరంతో ఎందుకలా దెబ్బలాడావు సత్యా?' అన్నాడు శంకరం.

'దెబ్బలాడ లేదు. కేవలం వాదించాను. నిజంగా దెబ్బలాడినట్లయితే, ఇంత గొడవ జరక్కపోను' అన్నది సత్యవతి.

'అసలు ఇదంతా ఎందుకు జరిగిందా అని! నన్నడిగితే ఇందులో రొష్టు పడవలసిం దేమీ లేదంటాను. నువ్వు చేసిన

మంచి చెడ్డల్ను గురించి నేను మాట్లాడటం లేదు. నిన్ను నేను శంకించటం గూడా లేదు. అయినా మీ అన్నయ్య మాటల్లోనే సత్యమున్నదేమో నువ్వెందుకు ఆలోచించవు? సుందరం అన్నట్టు కీర్తి సుఖంగా బ్రతకటానికి ఉపయోగపడదు. ఉపయోగ పడేదల్లా డబ్బు...నేను చాలా కాలం తరువాత నీతో అరవిడిచి చెబుతున్నాను. నేను చాలా బీదవాణ్ని. నన్ను నేనే పోషించుకోలేని స్థితిలో వున్నాను. ఇలాంటి దౌర్భాగ్యుణ్ని పెళ్ళాడి నువ్వు సుఖపడే దేమిటో తెలియకుండా ఉంది' అన్నాడు శంకరం, సత్య కళ్ళల్లోకి చూస్తూ.

'తెలియకుండా ఉంది ఎవరికి? మీకా?' అన్నది సత్యవతి మౌనంగా నవ్వి. 'మీ సంగతి తెలీదు గానీ, నా మట్టుకు నాకేదో సుఖపడగలననే అనిపిస్తున్నది. ఇది భ్రమే కావచ్చు. కానీ నేనిదే నిజమనుకొంటున్నాను. ఈ నిజం, నిజం కాదనీ భ్రమనీ నన్నెందుకు రుజువు చేసుకో నివ్వరు?'

శంకరం ఫక్కున నవ్వాడు. సత్యవతి రవంత కించపడింది.

'అప్పటికి అన్నీ చెయ్యి దాటిపోవచ్చు. ఆ తరువాత నువ్వు రుజువు చేసుకోవలసిన అవసరమే కలగక పోవచ్చు...... అయ్యో! అదేమిటి సత్యా! ఎందుకలా బెంబేలు పడతావ్? ఇప్పుడు నేనేమన్నాననీ నువ్వు కళ్ళంట నీళ్ళు పెట్టుకోవటం!' అన్నాడు శంకరం, ఆమెను ఓదార్చే ధోరణిలో.

ఏమన్నదీ సత్యవతి చెప్పలేదు. శంకరమే తిరిగి మాట్లాడ సాగాడు.

'నేను, వున్న పరిస్థితిని నీకు చెప్పాను. బహుశా, ఇలా జరగవచ్చుని నేను ఊహించిందే నీతో అన్నాను. నా ఊహ తప్పు కావచ్చు; తప్పవుతుందో, కాదో, ఇప్పుడప్పుడే నిర్ణయించలేం! కీడెంచి మేలెంచటం మంచిది గనుక అలా అన్నాను....అదిగాదు సత్యా! నువ్వంటే నాకిష్టం లేదనుకోకు. అవసరమొచ్చింది గనుక బైట పడుతున్నాను.....' అన్నాడు శంకరం ఓ క్షణం తలవంచుకొని.

సత్యవతి కళ్ళు టప టప లాడించి, శంకరం ముఖంలోకి ఆత్రంగా చూసింది. శంకరం ఓ పొడి దగ్గు దగ్గి, దీర్ఘంగా నిట్టూర్చాడు.

'నీ అభిప్రాయమేదో నువ్వు చెప్పావు –' అని ఆగిపోయాడు శంకరం.

'ఇప్పుడు నీ అభిప్రాయం కూడా తెలుసుకోందా మనుకొంటున్నాను' అన్నది సత్య.

'అలా తెలుసుకోవడానికి ముందు, నువ్వొకందుకు సిద్ధపడి ఉండాలి. నా అభిప్రాయం నీ వనుకొన్నదానికి, పక్తు వ్యతిరేకంగా ఉంటుందనుకో, అప్పుడేమిటి చెయ్యడం?' అన్నాడు శంకరం ఇసికలో సుతారంగా గీతలుగీస్తూ.

తనీమాట అన్నప్పుడు, సత్యలో కలిగే సంక్షోభం చూడలేకనే, అతనలా తలొంచుకొన్నాడేమో!

'వ్యతిరేకంగా ఉండటమా? అదేమిటి? అలా ఉంటుందని నేననుకోవడం లేదు.'

'నువ్వనుకొంటున్నావని కాదు; ఒకవేళ-ఉంటే సంగతే మిటనే నే నడుగుతున్నాను...' అన్నాడు శంకరం చప్పరించి. 'ప్చ్, లాభంలేదు. నే నెంత సూచనగా అంటున్నా నువ్వు గ్రహించడం లేదు. కనీసం గ్రహించాలన్న ప్రయత్నం గూడా చేయడం లేదు....అదిగాదు సత్యా! నువ్వు ప్రేమించ డానికి నాలాంటి దౌర్భాగ్యుడు తప్ప ఇంకెవ్వడూ దొరక లేదా? అదీగాక— నీకు నాపట్ల ఉన్న సదభిప్రాయమే, నాకూ నిన్ను గురించి ఉన్నదో లేదో నువ్వు ముందుగా ఆలోచించి ఉండవలసింది....'

'ఆలోచించాను. ఆలోచించిన తరువాతనే, ఈ నిర్ణ యానికి వచ్చాను.' అన్నది సత్య.

'అంటే నీ మనస్సుకు సరిగ్గా ఆలోచించటం తెలియ దన్నమాట. నిజంగా తెలిసే ఉన్నట్లయితే, అది ఇలాంటి నిర్ణ యం చేసి ఉండదు. ఎందుకంటున్నానంటే—ఇప్పుడు నువ్వం టున్నదాకా, నిన్ను పెళ్ళాడాలన్న ఆలోచనే నాకు రాలేదు. నీ ధోరణి చూస్తుంటే చాలాకాలం నుండి, నువ్వీ ఆలోచనలో ఉన్నావేమో ననిపిస్తున్నది. ఇంతకాలం తరువాత గానీ, నువ్వీ నిశ్చయానికి రాలేదు. మరి నేనూ ఓ నిశ్చయానికి రావటానికి కొంత సావకాశం కావాలి.'

సత్యవతి మనస్సులో ఏదో భయం, జెర్రిలా బుసలు కొట్టింది. శంకరం చల్లగా జారిపోతున్న అనుమానం కలిగింది. అందుకే అమీ తుమీ తేల్చుకొందామనీ అనుకొంది.

'మరేం లేదు. నీకూ నాకూ మధ్య చాలా అంతర ముంది. నువ్వు నా స్థితికి రాలేవు. నేను నీ స్థాయిని అందు కోనూ లేను. అందుకే మన దాంపత్యం పదికాలాలపాటు ఉండ దేమో ననిపిస్తున్నది. ఇలాంటి అనుమానం కలక్కుండానే ఉండాలి. తీరా కలిగిన తరవాత గూడా మనం దాంపత్యం వెలగబెట్టడానికి సిద్ధపడటమంటే—అంతకన్నా తెలివిమాలిన పనిని నేను ఊహించలేను.' అన్నాడు శంకరం.

'నీ అభిప్రాయం ఇదేనా శంకరం?' అన్నది సత్యవతి. అట్లా అంటున్నపుడు ఆమె కంఠం బొంగురు పోయింది. కళ్ళు అశ్రుతప్తా లయినాయి.

శంకరం ఏమీ మాట్లాడకుండా 'అవు'నన్నట్టుతలమాత్రం కదిపాడు.

'ఎన్నో అనుకొన్నాను. ఎన్నో రకాలుగా కలలు గన్నాను. చివరకు నువ్విట్లా అన్నావు ...' అన్నది సత్యవతి తడబడుతూ. 'కానీ, నువ్వొకప్పుడు పశ్చాత్తాప పడతావు. నీ మూలంగా ఒక స్త్రీ ఆత్మహత్య చేసుకోవడం నీ కిష్ట మయితే....'

'ఏమిటీ?' అని ఉలిక్కిపడాడు శంకరం.

సత్యవతి ఏమీ మాట్లాడలేదు.

'నువ్వీమాట నిజంగానే అంటున్నావా సత్యా?' అన్నాడు శంకరం ఆమె ముఖంలోకి చూస్తూ.

ఈసారి గూడా సత్యవతి మాట్లాడలేదు. శంకరం

కాస్సేపు తీవ్రంగా ఆలోచించి, మరుక్షణం ఫకాలుమని నవ్వాడు.

'ఓ. ఇక నిన్ను పరీక్ష చెయ్యవలసిం దేమీ లేదు. ఇంత కాలంనుండీ, నాకున్న సందేహాలన్నీ తీరిపోయాయి. అవి తీర్చు కోవడం కోసరమే, నే నింతసేపూ పస్తాయించాను...' అన్నాడు శంకరం మెత్తగా ఆమె చేతిని నొక్కుతూ.

మొదట సత్యవతి దిగ్భ్రాంతి చెందింది. ఆ తరువాత, శంకరం వేపు చిత్రంగా చూసింది.

'నీ కేమాత్రం ఆలోచనున్నా, నా అభిప్రాయం ఎప్పుడో పసిగట్టి ఉండేదానివి. ఎదరింట్లో నుండి, మీ యింటికి మారినప్పుడే, నన్ను నీ వర్థం చేసుకొని ఉండవలసింది. ఆ పని చెయ్యడానికి ఇన్నిరోజులు పట్టింది. నేనూ ఈ విషయం నీతో చెప్పాలని చాలాకాలం నుండీ అనుకొంటున్నాను. కానీ, నీ అభిప్రాయం తెలుసుకోకుండా, ముందుగా బైటపడటం మంచిది కాదని మానేశాను. సరే అయిందేదో అయింది. ఇప్పుడు మనం చెయ్యవలసిం దేమిటి ? ఈ పెళ్ళికి మీ నాన్నా అమ్మా, ఎటుగూడీ ఒప్పుకోరు. సుందరానిగ్గూడా, ఆటే ఇష్టం ఉన్నట్టు లేదు. మరి ?' అన్నాడు శంకరం.

సత్యవతికి సంతోషం పుక్కిలింత లయింది.

'నాకేమీ తోచడం లేదు.' అన్నాడు శంకరం.

సత్య ఓ క్షణం ఏదో జ్ఞాపకం తెచ్చుకొందుకు ప్రయత్నించి, నవ్వుతూ, "మీ 'ప్రణయజీవులు' కథ చదివాను.

అందులోని కథానాయకుడు, కథానాయకి గూడా, ఇలాంటి చిక్కునే ఎదుర్కొంటారు. అప్పుడు ఆ కథను మీరెలా ముగించారు ?' అన్నది.

'ప్రణయ జీవులంటే....ఓహో—ఆ కథా...అవునవును. చక్కగా జ్ఞాపకం చేశావు సత్యా! ఆ కథ ముగింపు బాగా కుదిరింది. నాయకీ నాయకులు కూడబలుక్కుంటారు. కథానాయకి వంటిమీది నగలు కాక, అయిదువేల రూపాయల రొఖ్ఖం జాగ్రత్త పరుస్తుంది. ఇద్దరూ కలిసి, ఆ ప్రశాంతమైన రాత్రి, చల్లని పిల్ల తెమ్మెరలు వీస్తూ ఉంటే, చంద్రుడు తమ కోసమే వెన్నెలను కురిపిస్తుంటే, ఆ సన్నని కాలిబాట వెంట ఒకరి కొకరు చెట్టపటాలు పట్టుకొని, దూరదేశాలకు వెళ్ళిపోతారు. అవును గదూ ?' అన్నాడు శంకరం.

సత్యవతి చిలిపిగా నవ్వింది.

'పరిష్కారం దొరికింది. ఇక వెడదాం సత్యా! ఎవరి ప్రయత్నాల్లో వారు ఉందాం. ఇదే ఖరారు. మెయిలు రాత్రి రెండు గంటలకు...నా గది తలుపు వారగాతీసి ఉంటుంది.....' అన్నాడు శంకరం.

సత్య లేచే ప్రయత్నంలో ఉంది. శంకరం ఆమె చెయ్యి పట్టుకొని లేవదీశాడు. సత్య నవ్వింది. శంకరమూ నవ్వాడు.

ఇవన్నీ అక్షరాలా జరుగుతాయని సత్య నమ్మింది. అందుకే ఆ రోజున ఆమె కెక్కడాలేని సంతోషం కలిగింది. ఏదో పనిచేస్తున్నట్టు నటిస్తూ, తన నగలన్నీ సర్దుకొంది. ఆ కథలో లాగా అయిదువేలు కాకపోయినా, వీలున్నంతవరకూ డబ్బు తీసి జాగ్రత్త పరిచింది. ఆట్టే బరువు లుండటం మంచిది కాదు కనుక, రెండుమూడు జతల బట్టలకంటే ఎక్కువ తీసుకోలేదు. శంకరం ఏం చేస్తున్నాడో నని, ఒకటి రెండుసార్లు అతని గది కేసి తొంగిచూసింది. అతగాడూ పుస్తకాలూ అవీ సర్దుకొంటు న్నాడు. సత్యను చూసి చిలిపిగా నవ్వాడు. మెల్లిగా ఈల వేశాడు.....

ఆ రాత్రి సత్యకు నిద్ర పట్టలేదు. ఊరికే పక్కమీద అటూఇటూ పొర్లాడింది. మాటిమాటికీ గడియారం వంక చూసింది. ఒకసారి చూస్తే తొమ్మిది గంటలయింది. ఇంకోసారి చూస్తే తొమ్మిదిం బావయింది. ఈ గడియారం ఎప్పటికి ఒంటి గంట చూపిస్తుందో ? ఎప్పుడు తనూ, శంకరం హాయిగా చెట్టా పట్టా లేసుకొని.....

హమ్మయ్య ! ఒంటిగంట యింది. సత్యవతి గుండెలు గుబులుగుబులు మన్నాయి. మెల్లగా మంచం మీదినుండి లేచింది. చప్పుడు కాకుండా తలుపులు తీసింది. పెట్టె చేతబట్టు కొని శంకరం గది దాపు కొచ్చింది. వారగా వేసివున్న తలుపులు నెట్టింది. (ఇంతసేపూ నువ్వనుమానిస్తున్నట్టే) శంకరం

అక్కడ లేదు. అలా లేనందుకు సత్యవతి ఆశ్చర్య పడలేదు. ఆ మాత్రం స్థోమతగూడా ఆమెకు లేకుండా పోయింది. సర్వస్వం ఊడ్చిపెట్టుకుపోయిన దానిలా కుప్ప కూలిపోయింది. బావురు మని గొంతెత్తి ఏడవాలనిపించింది. అయినా ఆమె అను కొన్నవి, ఏవి సక్రమంగా జరిగాయి గనక ?

ఇన్ని జరిగినా, ఆనాడుగూడా 'భళ్ళున' తెల్లవారింది. సూర్యుడు తూర్పునే ఉదయించాడు. ఏదో విలయం జరుగు తుందని సత్య అనుకొంది గానీ, ఏమీ జరగలేదు. శంకరం ఇలా హఠాత్తుగా మాయం గావడం గురించి, ఆ ఇంటిల్లపాదీ, నాలుగురోజులు ఆగుబ్బుగా చెప్పుకోన్నారు. అందరితో బాటు సత్యగూడా తన వంతు ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

*　　*　　*

అవును. అంతకుదప్ప తను చేయగలిగిందేమీ లేదు. ఇంకా నయం! తన గుట్టు బయట పడలేదు. పడినట్లయితే తన జీవితం ఎలా ఉండాలో అలానే ఉండేది. అంతగా చెప్పాడు కనుక, తను శంకరం మాటలను నమ్మింది. నిజంగానే తా మిద్దరూ కలిసి, ఎటో వెళ్ళిపోదామనీ, ఏవేవో చేదామనీ కలలు కన్నది. కానీ, ఆ కలలన్నీ కరిగిపోయాయి. శంకరం పిరికిపందలా పారిపోయాడు. ఇన్ని సంవత్సరాల తరవాత, ఇప్పుడాలోచిస్తుంటే, అతగాడలా పోవడమే మంచిదేమో నని పిస్తున్నది. పోకపోయినట్లయితే, తన కిలాంటి మంచిసంబంధం వచ్చేదీకాదు; ఇలాంటి సుఖాలు లభించేవీ గాదు....

పెళ్ళి చూపులకని వచ్చినప్పుడు, రామ్మూర్తి మీద తన కెలాంటి అభిప్రాయమూ లేదు. అప్పుడు తను అభిప్రాయం చెప్పగల స్థితిలోగూడా లేదు. శంకరం చేసిన గాయం, ఓవంక బాధపెడుతూనే వుంది. అందుకే తనకు అన్నిటిమీదా విరక్తి గలిగింది. తను మనస్ఫూర్తిగా కావాలనుకొన్న శంకరమే తనకు కాకుండా పోయినప్పుడు, ఎవణ్ని పెళ్ళాడితే ఏమని పించింది. అందుకే తను మరో మాటలేకుండా, ఈ పెళ్ళికి ఒప్పుకొంది....

ఇప్పుడు తనకేలోటూ లేదు. తన భర్త గౌరవనీయమైన ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటినిండా బోలెడంత మంది పనివాళ్ళున్నారు. తను కోరిన గుడ్డ కడుతున్నది. తన జీవితం సుఖంగా గడచిపోతోంది. తను క్రమక్రమంగా దీనికి అలవాటుపడి పోయింది. ఇంతకాలంలోనూ తనకు అనేకసార్లు జ్ఞాపకం వచ్చాడు శంకరం. అలా వచ్చినప్పుడు మనస్సంతా సంక్షుభిత పడిపోయేది. ఏదో తీర్చరాని వెలితిగా తోచేది.

అయినా రోజులు గడుస్తూనే ఉన్నాయి. ఆనాటి గాయం గూడా క్రమంగా మానిపోసాగింది. ఎప్పుడో గానీ అది బాధపెట్టదు. అదయినా ఒకటి రెండు క్షణాలు. తనకా అదృష్టం గూడా లేనట్టు, హఠాత్తుగా ఇవ్వాళ శంకరం మళ్ళా కనిపించాడు. అతను శంకరమని, తను చప్పున గుర్తుపట్టలేక పోయింది. మనిషి ఎంత మారిపోయాడు! ఇదివరకు శంకరానికీ, ఇప్పటి శంకరానికీ అసలు పోలికే లేదు. ఇదివరకు దరిద్రం

ఓడుతూ ఉండేవాడు. ఇప్పుడు లక్షాధికారిలా వున్నాడు. వేళ్ళకు రవ్వల ఉంగరాలున్నాయి. ఖరీదైన గుడ్డలు వేసుకొన్నాడు. అధమ పక్షం పది, పదిహేను వేలు ఖరీదుచేసే కారున్నది. ముందుగా తనను పేరుబెట్టి పిలిచినప్పుడు, తను ఉలిక్కిపడి. వెనక్కి చూసింది. శంకరం సన్నగా నవ్వాడు. పేరు చెప్పిందాకా, తను శంకరాన్ని గుర్తుపట్టలేక పోయింది.

'అంతగా మారిపోయానా సత్యా?' అన్నాడు శంకరం కారు దిగి దగ్గరగా వచ్చి.

ఆమాట వినగానే తనకు పాత సంగతులన్నీ జ్ఞప్తికొచ్చాయి. దుఃఖం ఉవ్వెత్తుగా తనను ముంచి వేసింది. ఇలా నట్టనడి బజారులో, తను ఏడవటం ఎవరన్నా చూస్తే? బలవంతాన తనను తాను నిగ్రహించుకొంది.

'కులాసాగా ఉన్నావా సత్యా?' అన్నాడు శంకరం.

అంతవరకూ – తనకు ఏలోటూ లేదనుకొంది తను. చాలామందికంటే, సుఖంగా, హాయిగా, తృప్తిగా, జీవిస్తున్నా ననుకొంది. కానీ శంకరం, ఆ ప్రశ్న అడగ్గానే, తన అభిప్రాయం కాస్తా మారిపోయింది. నిజంగా తను సుఖపడటం లేదనిపించింది నిజమైన సుఖమంటే ఏమిటో తెలియక, దాన్ని పొందలేక, అందినదానినే, సుఖంగా భావిస్తున్నదేమో నన్న అనుమానం రేకెత్తింది. నిజంగా శంకరం కనిపించకుండా ఉన్నట్లయితే, తనకే అనుమానమూ కలిగేది కాదేమో!

చాలాకాలం తరువాత, తిరిగీ తనకు కనిపించిన శంకరం

ముందు, తన సొదంతా చెప్పుకోవా లనిపించింది. అందుకే తను గూడా చప్పున కారులో కూచుని, 'పోనియ్ శంకరం' అన్నది.

ధూళి రేపుకొంటూ కారు రోడ్డుమీద పరుగెడుతోంది. మనుషులు, చెట్లు, బళ్ళు, సర్రున వెనక్కు జారిపోతున్నాయి. శంకరం ఎటూ చూడకుండా కారును పోనిస్తున్నాడు. సత్యవతి; శంకరం వంక పిచ్చిదానిలా చూస్తోంది.

చెట్లవెనక అందంగా సాయంత్రం సాగిలబడ్డది. మబ్బులు సూర్యకాంతికి బరువెక్కి మత్తుగా జోగాడుతున్నాయి. ఓ చిన్న కుదుపుతో కారు ఆగిపోయింది. ముందుగా శంకరం దిగాడు. దిగి, కారు తలుపు తెరిచాడు. సత్య, భారంగా కిందికి అడుగు పెట్టింది. ఇద్దరూ రోడ్డును వదిలి, గట్లవెంట పొలాలలో కొచ్చారు. మేతమేస్తున్న ఆవు, ఓ నిమిషం మేయడం ఆపి, వీరివంక చూసి తిరిగి తలొంచుకొంది. గడ్డిలో దాక్కున్న చిమ్మటలు, ఎగిరి దూరంగా పోతున్నాయి. ఇద్దరూ ఓ చదునైనచోట చదికిల బడారు.

కొంతసేపు ఎవ్వర్నూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనల్లో వారున్నారు. ఆ నిశ్శబ్దం భరించరాని దయింది. ముందుగా శంకరమే ప్రారంభించాడు.....

అతనిప్పుడు సినిమాలకు కథలు రాస్తున్నాడట. ఒకోక్క పిక్చరుకు ఐదారు వేలదాకా ముడుతున్నాయట. ప్రస్తుతం నాలుగు పిక్చర్లకు రాస్తున్నాడట. తను రాసిన చిత్రం శత

దినోత్సవం చేసుకోవడం ఇదే మొదలట. అందుకే యాక్టర్సుతో బాటు తను గూడా బెజవాడ వచ్చాడట. సత్య ఈ ఊళ్ళో ఉంటున్నట్టు తనకు తెలియదనీ, యాక్సిడెంటల్గా కలుసు కోవడం జరిగిందనీ అన్నాడు. రోజులు సుఖంగానే గడచిపోతున్నాయన్నాడు. నువ్వేలా ఉన్నా వన్నాడు.

ముందు కొంతసేపు సత్య ఏమీ మాట్లాడలేదు. ఏదో మాట్లాడాలని ప్రయత్నించాక, మాట పెగల్లేదు. ఏదో చెప్పరాని దుఃఖం ఆమెను ముంచెత్తుతోంది. ఏదో విచారం కొండల పెట్టుగా ఆమెను అణచివేస్తోంది.

'అయితే, ఆ సంఘటన నువ్వింకా మరిచి పోలేదన్న మాట !' అన్నాడు శంకరం.

సత్యవతి నిట్టూర్చింది.

'అది అసాధ్య మనుకుంటాను. ఇంతకాలమూ నేను గూడా మరచిపోయాననే అనుకొన్నాను. నేను సుఖంగా ఉన్నాననే అనుకొన్నాను. నువ్వు కనిపించకపోతే, ఇక మీదట గూడా, అలాగే అనుకొంటూ ఉండేదాన్ని. ఇప్పుడా అవకాశం లేకుండా చేశావు. మానిపోయిందనుకొన్న గాయాన్ని, తిరిగి రేపావు.' అన్నది సత్య.

శంకరం, ఓసారి ఆశ్చర్యంగా ఆమెవేపు చూసి తలొంచుకున్నాడు.

'ఆనాడలా ఎందుకు చేశావ్ శంకరం ? నాతో ఎందుకు అబద్ధమాడావ్ ? నన్నెందుకు మోసం చేశావ్?' అన్నది సత్య.

'ఎందుకు చేసినా, అది బుద్ధిపూర్వకంగానే చేశాను. నా మీద నాకే నమ్మకంలేని కాలమది. నన్ను నేనే పోషించుకోలేని స్థితిలో ఉన్నాను....నువ్వన్నట్టు, మనిద్దరం ఎటో వెళ్ళి పోయినట్టయితే, సర్వనాశనమయి ఉండేవాళ్ళం. చేతులారా నీ బ్రదుకును బ్రద్దలు కొట్టడం ఇష్టంలేక చెప్పకుండా వెళ్ళి పోయాను. నువ్వంటే ఇష్టం లేక కాదు వెళ్ళిపోయింది; ఇష్టం గనకనే, నిన్ను బాధ పెట్టడానికి మనస్సొప్పక, నీ క్షేమం కోరి ఆ పని చేశాను. నే నిలాంటి స్థితిలో ఉన్నట్లయితే, నిన్ను తప్పకుండా పెళ్ళాడి ఉందును. ఆనాడు నాకా అవకాశం లేదు; కానీ, నువ్వున్నావు. ఈనాడు నాకెన్నో అవకాశాలు న్నాయి. అయితేనేం, నవ్వు లేవు.' అన్నాడు శంకరం.

చీకటి పడింది. దూరంగా బెజవాడలోని లైట్లు, మసగ్గా వెలుగుతున్నాయి. రోడుమీద, కాంతిని విరజిమ్ముతూ, రెండు కార్లు బెజవాడ కేసి పోతున్నాయి. దాపులోనే, ఎడ్ల మెడల్లోని గంటలు, మందంగా మోగుతున్నాయి. మిణుగురు పురుగులు, అక్కడక్కడ దీపాలు వెలిగిస్తున్నాయి. గట్టుకు అల్లంతదూరములో, ఏదో ప్రాణి జరజర మని పాకుతోంది.

సత్యవతి, ఓ గరిక పూచను పీకుతూ, 'నువ్వు రాసిన సినిమా చూశాను శంకరం.' అన్నది.

ఈ మాట అన్న తరువాత, శంకరం ఏమనుకొంటు న్నాడో తెలుసుకొందుకు, అతని ముఖంలోకి చూసింది.

ఇంతకాలంగా జీవించినది జీవితం కాదు, మరేదో అవుతుంది. తనను తను మోసపుచ్చుకొన్నది; భర్తను గూడా మోస పుచ్చింది. ఇప్పటివరకూ, తనకీ జీవితమే ఉత్తమంగా కనిపించిం దంటే, అది తన తెలివి తక్కువే ననాలి. వేరే గతిలేక, తప్పని సరయి, తనను తాను మోసగించుకొనే ప్రయత్నంలో, అలా అనుకోక తప్పలేదు. కానీ ఇప్పుడా అవసర మేమీ లేదు. ఇక తను, హాయిగా జీవించవచ్చు. ఈ నాటికైనా ఈ 'మాయ తెర' నుండి తనకు విముక్తి కలుగుతున్నది. ముందుగా తను, భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి....

ఆ పని ఇంకా ప్రారంభం కాకముందే, రామ్మూర్తి వచ్చాడు. వస్తూ వస్తూ వెంట ఓ పిల్లవాణ్ని గూడా తెచ్చాడు. రామ్మూర్తిని చూడంగానే, సత్యవతి దిగ్గున లేచింది. భర్తకేసి అసహ్యంగా ఓ చూపు చూసింది. రోజూ అందంగా కనిపించే రామ్మూర్తి, ఆ రోజున ఆమె కళ్ళకు దయ్యంలా అవుపిం చాడు.

'చాలా ఆలస్య మయింది సత్యా! అప్పటికీ పెందరాడే ఇంటికి రావాలని బయలుదేరాను. మధ్యలో వీడి గొడవొకటి వొచ్చిపడ్డది.' అన్నాడు రామ్మూర్తి చొక్కా విప్పుతూ. 'ఏరా మధూ! అలా నిలబడావేం ? ఆ మంచంమీద కూర్చో!' అన్నాడు ఆ కుర్రాడి కేసిచూసి.

'ఎన్ని గొడవలైనా ఈ కాస్సేపే కదా' అనుకొన్నది సత్యవతి.

'వేన్నీళ్ళున్నాయా?' అన్నాడు తుండుగుడ్డ చుట్టు కొంటూ. 'లేవా? పోనీలే, ఈ పూటకు కాళ్ళు కడుక్కుంటూ. రారా మధూ! కాళ్ళు కడుక్కొందాం....ఏమోయ్! అన్నం వడ్డించు వస్తున్నాను.' అంటూ మధును తీసుకొని దొడ్లో కెళ్ళాడు రామ్మూర్తి.

రామ్మూర్తి గబగబా తింటున్నాడు. మధుకు అన్నం కలుపుకోవడమే చేతగావడం లేదు. కలిపినప్పుడల్లా, అన్న మంతా కిందపోతున్నది. అది ఏరి కంచంలో పెట్టుకోవడం కుదరడం లేదు. అన్నం తినాలన్న ప్రయత్నంలో, అయిదేళ్ళ మధుపడే తాపత్రయం చిత్రంగా వుంది. వాడు కాసిని మెతు కులు నోటబెట్టుకొన్నాడు. మంచినీళ్ళ కోసం గావును - అటూ యిటూ చూశాడు. బలమంతా వుపయోగించి, రెండు చేతులతోనూ గ్లాసును ఎత్తి నోటి దగ్గర పెట్టుకొన్నాడు. నీళ్ళన్నీ కంచంలోకి వొలికి పోయాయి. వాడి చొక్కా మొత్తం తడిసింది. గ్లాసును అలాగే వదిలేసి, బావురుమని ఏడ్చాడు.

'పోనీ ఆ పీటను ఇలా దగ్గరికి లాగవే! ఈ పూట నా దగ్గరనే తింటాడు' అన్నాడు రామ్మూర్తి భార్యతో. 'ఇశ్శో! ఏడవబోకు బాబూ! మా నాన్నవు కదూ! ఏడవ బోకు. ఇంద - ఇలా నా దగ్గర కూచుని తిను....ఊఁ పట్టు..... ఇదిగో గోరుముద్ద. నోరు తెరువ్....'

'నాకొద్దు' అన్నాడు మధు వెక్కెక్కి పడుతూ.

'నీకు మంచి తాయలం పెడతాను. మా బాబువి కదూ!.... ఏవోయ్....మధు అన్నంతిన్న తరవాత నే, ఇన్ని చాక్లెట్లివ్వు' అన్నాడు రామ్మూర్తి చేతులు బారసాచి.

'నేను తిన్ను' అన్నాడు మధు.

'మరేం కావాలోయ్!' అన్నది సత్యవతి విసుగ్గా. మధు సత్యవతి వంక బిక్కు బిక్కుగా చూశాడు. రామ్మూర్తికి దగ్గరగా జరిగి 'అమ్మ కావాలి!' అన్నాడు.

'అయినా ఇవేం ముద్దులండీ గుంజలో ముద్దులు! తల్లికి మాలిమైన పిల్లలు ఉంటారుటండీ! మీరెంత చెప్పినా వాడు తినకపోతుండే! చూస్తూ చూస్తూ వాణ్నెట్లా వస్తు పడుకో బెడతాం? ఇప్పుడు దేవుడోమంటూ, వాణ్ని మళ్ళా ఇంటి దగ్గర దిగ విడిచి రావాలి. ఎందుకొచ్చిన లాయలాసంట ఇదంతా! అన్నది సత్యవతి రుసరుసలాడుతూ.

రామ్మూర్తి ఏమీ మాట్లాడకుండా, లేచి చేయి కడుక్కొన్నాడు. వక్క పలుకు ఊది నోట్లో వేసుకొంటూ, 'కాసిని పాలుంటే వాడికి పట్టు. నాకు పక్క వెయ్యి. వీడు నా దగ్గరే పడుకొంటాడు' అన్నాడు.

'అదేం?' అన్నది సత్యవతి ఆశ్చర్యంగా.

సమాధానం చెప్పకుండా రామ్మూర్తి సిగరెట్టు ముట్టించాడు.

వంటిల్లు సర్ది, సత్యవతి గూడా వచ్చింది. చదువుతున్న పుస్తకాన్ని ఠప్పున మూసి, సత్యవతి కేసి చూస్తూ అన్నాడు రామ్మూర్తి—

'ఇప్పటికే నీకు పని భారంగా వుంది సత్యా! రేపటి నుండీ, ఇంకో భారం కూడా నీ కొప్పగిస్తున్నాను. ఇక మధు మన దగ్గరే ఉంటాడు. బాబు మనకు పెద్దవాడయితే, మధు రెండో పిల్లవాడనుకో. అలా చూస్తానని ప్రమాణం చేసి, రాజారావునుండి ఈ పిల్లవాణ్ని తీసుకొచ్చాను!'

ఏమిటన్నట్లు చూసింది సత్యవతి.

'ఏదయినా జరగవలసిందేదో జరిగిపోయింది. దాన్ని గురించి, ఎవ్వరు విచారించీ చేయగలిగిం దేమీ లేదు. కానీ నాకు పట్టుకొన్న విచారమల్లా ఒక్కటే సత్యా! మనుషులు ఇంత బుద్ధి హీనులెందు కవుతారా అని! ఒకరు చేసిన అపరాధానికి, మరొకరు ఘోరాతిఘోరంగా శిక్షింపబడటం, న్యాయమని, నే ననుకోను. కాని ఇప్పు డదే జరిగింది.' అన్నాడు రాంమూర్తి మెల్లగా మధు వీపు నిమురుతూ.

'ఏం జరిగిం దేమిటి?' అన్నది సత్యవతి.

రాంమూర్తి ఓసారి తల అడ్డంగా ఊపాడు.

'ఏపని చెయ్యటానికైనా, ఎవ్వరికైనా హక్కు ఉంది. ఆ హక్కును వాళ్ళు ఉపయోగించుకోవచ్చు కూడాను. కాని అదే సమయంలో, రవంత వివేకంగా ఆలోచిస్తే, చాలా జీవితాలు దుమ్ములో కలిసిపోకుండా కాపాడబడుతాయి.' అన్నాడు రాంమూర్తి అటూ ఇటూ తిరుగుతూ. 'అనసూయ ఇలాంటి పనిచేస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. ఆవి డెప్పుడో ప్రేమించిన వాడు, ఈ ఊరు వచ్చాడట. వాడితో గతరాత్రి

వెళ్ళిపోయింది. వీడు ఉదయం నుండీ, ఆ లేచిపోయిన తల్లి కోసం గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు. వీడి ఏడుపు చూడ లేక, రాజారావుకు నచ్చచెప్పి, నేను వెంట తీసుకొచ్చాను. మనం ఎంత శ్రద్ధగా చూచినా, వాడా తల్లిని మరచిపోడు. నిజంగా వాడికేం కావాలో అనసూయకు తెలుసుగానీ, నీకూ నాకూ, ఎలా తెలుస్తాయి? రేపు వీడు పెరిగి పెద్దవాడై, పదిమందిలోకి వెళ్ళినప్పుడు, 'ఆ లేచి పోయిందాని కొడుకు' అని వీడి చెవుల పడ సందర్భాన, వాడి మనస్సు ఎంత క్షోభించి పోతుందో, కాస్తంత ఆలోచించినట్లయితే, అనసూయ ఈపని చేసివుండేది కాదేమో! ఈనాడు వీడు దిక్కులేని వాడ య్యాడు. మనం ఎంత ఆదరించినా, ఎంత లాలించినా, ఎన్ని భోగ భాగ్యాలిచ్చినా, వాడికా 'అమ్మను' ఇవ్వలేం. ఆ లోటు మనం తీర్చేది కాదు, తీర్చగలిగిందీ కాదు.'

ఉలిక్కిపడి చూశాడు రాంమూర్తి. సత్యవతి రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడుతోంది.

'అదేమిటి సత్యా! ఎందుకలా ఏడుస్తావ్?' అన్నాడు రామ్మూర్తి, భార్య దగ్గరకొచ్చి బుజ్జగిస్తూ.

ఎందుకో సత్యవతి చెప్పలేదు గానీ, ఆమె మాత్రం భర్త హృదయంలో ముఖం దాచుకొని కుమిలి పోయింది.

'లోకంలో ఇలాంటివి చాలా జరుగుతుంటాయి సత్యా! మనం దాన్ని గురించి విచారించడం మినహా మరేమీ చెయ్యా లేం .... వెళ్ళు. పడుకో. నిన్ను అనవసరంగా బాధ పెట్టాను.

నా మాటలు నిన్నింత నొప్పించుతాయని, నేననుకోలేదు.'
అన్నాడు రాంమూర్తి.

సత్యవతి ముఖం ఎర్రగా కందిపోయింది. కళ్ళు జ్యోతుల్లా మండిపోతున్నాయి. మనిషి నిలువునా వణికి పోతున్నది! అలానే తూలుకొంటూ వెళ్ళి, మధును, భుజంమీద వేసుకొని, తన గదిలో కొచ్చింది. బాబు గాఢంగా నిద్రపోతున్నాడు. ఏ దేవతలు, కలలో కనిపించారో మరి, సన్నగా నవ్వుతున్నాడు. మధునుగూడా బాబు ప్రక్కనే పడుకోబెట్టింది. ఆ ఇద్దర్ని తదేకంగా చూసింది. ఆమెలో ఉప్పెనలా దుఃఖం విరుచుకు పడింది.

'లేదు. లేదు. అలా జరగడానికి వీల్లేదు. నా బాబు తల్లిలేనివాడు కావడానికి వీల్లేదు.' అనుకొంది సత్యవతి.

ఆ ఇద్దరు బిడ్డలనూ, దగ్గరకు తీసుకొని, కళ్ళు మూసుకొంది.

అర్ధరాత్రప్పుడు, ఓ ఖరీదైన కారు, ఆ వీధిలో కొచ్చిందనీ, తెల్లవారుఝాముదాకా ఉండి తిరిగి వెళ్ళిపోయిందనీ, సత్యవతికి తెలియదు; రాంమూర్తికి అంతకన్నా తెలియదు.